క్లుప్తంగా

వైభవంగా శివ పార్వతుల కల్యాణ రాట మహోత్సవం



రాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి రామ లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం శివపార్వతుల కల్యాణంలో భాగంగా రాట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం నాల్గవ సోమవారం శివ పార్వతుల కల్యాణం నిర్వహించే క్రమంలో రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ నెల 11న శివపార్వతుల కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపుతో పాటు సారె ఊరేగింపు నిర్వహిస్తామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గంగాదేవిపేటలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మూలపేట ఉప సర్పంచ్ దేవీచంద్ర

మునగపాక: ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర కోరారు. మూలపేట పంచాయతీ గంగాదేవిపేటలో శనివారం ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిబిరంలో ఆరోగ్య అధికారి యామిని సేవలందించారు. ఏఎన్‌ఎం రమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు



కొరుప్రోలు బ్లీచింగ్ జల్లుతున్న పంచాయతీ సిబ్బంది

ఎస్.రాయవరం: మండలంలో తుపాను కారణంగా నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపడుతున్నారు. కాలువలు శుభ్రం చేయించి, బ్లీచింగ్ జల్లుతున్నారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లో నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పూర్తి స్థాయిలో పనులు నిర్వహించాలని సిబ్బందిని ఈవోపీఆర్డీ సత్యనారాయణ ఆదేశించారు.

ఘనంగా సుదర్శన యాగం



తిమ్మరాజుపేటలో నిర్వహిస్తున్న సుదర్శన యాగం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో శనివారం సుదర్శన యాగాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయం ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హోమం జరిపారు. ఈ హోమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు.


మోకాళ్లపై నడుచుకుంటూ మునగపాక అయ్యప్ప ఆలయానికి



మోకాళ్లపై నడుస్తున్న అయ్యప్ప భక్తుడు రామకృష్ణ

మునగపాక: మండలం కేంద్రం మునగపాకకు చెందిన అయ్యప్ప భక్తుడు విల్లూరి రామకృష్ణ శనివారం మోకాళ్లపై నడుచుకుంటూ ఆలయానికి వెళ్లి తన మొక్కును చెల్లించుకున్నారు. అయ్యప్ప మాల ధరించిన సంతబయిలకు చెందిన రామకృష్ణ అయ్యప్ప పీఠం నుంచి కిలో మీటరు దూరంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వరకు మోకాళ్లపై నడుచుకుంటూ వెళ్లి అయ్యప్పను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గురుస్వామి పొలిమేర కృష్ణ తగు చర్యలు తీసుకున్నారు.

అభివృద్ధి మార్గాలు



ఇది కదా అభివృద్ధి

రూ.కోట్లతో తారు రోడ్ల నిర్మాణం

తీరిన ప్రయాణ కష్టాలు



ఏఐఐబీ నిధులతో నిర్మించిన సత్యవరం-మాసాహేబుపేట రోడ్డు



వీఎంఆర్‌డీఏ నిధులతో నిర్మించిన పాయకరావుపేట మెయిన్ రోడ్డు

పాయకరావుపేట: గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణం చేపడుతోంది. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని రహదారులు ఇప్పుడు అద్దంలా మెరుస్తున్నాయి. కొత్త రోడ్ల నిర్మాణంతో పాటు 110 కిలో మీటర్ల మేర మరమ్మతులు చేశారు. మండలంలోని పాయకరావుపేట పట్టణంలో రూ.1.95 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో మెయిన్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. పట్టణంలో రెండు కిలోమీటర్ల మేర ఉన్న మెయిన్ రోడ్డు నిర్మాణంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- చాలాకాలంగా అస్తవ్యస్తంగా ఉన్న సత్యవరం నుంచి మాసాహేబుపేట రోడ్డును ఏఐఐబీ నిధులు రూ.1.10 కోట్లతో నిర్మించారు.
- తుని నుంచి పెంటకోటకు పాల్తేరు మీదుగా వెళ్లే రోడ్డును రూ.4 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో నిర్మించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు రోడ్డు కష్టాలు తీరాయి.
- పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రాంటు ద్వారా మంజూరైన రూ.1.80 కోట్లతో 10 రోడ్లు నిర్మించారు. వీటిలో రూ. 28 లక్షలతో రాజుగారిబీడు రోడ్డు నిర్మాణం చేపట్టారు.
- రోడ్లు భవనాలు శాఖ పరిధిలోని పలు రోడ్లకు మరమ్మతులు చేశారు.
- శ్రీరాంపురం నుంచి కుమారపురం వెళ్లే 6,200 మీటర్ల రోడ్డుకు రూ.కోటితో మరమ్మతులు నిర్వహించారు.
- మంగవరం, గోపాలపట్నం వెళ్లే నాలుగు కిలో మీటర్ల రోడ్డుకు రూ.1.18 కోట్లతో మరమ్మతులు జరిపారు.
- తుని పాల్తేరు పాల్మన్‌పేట గ్రామాల రోడ్డుకు 2.63 కిలోమీటర్ల పొడవున రూ. 60 లక్షలతో మరమ్మతులు నిర్వహించారు.
- మండలంలో ఆర్‌అండ్‌బి పరిధిలో ఉన్న 9 రోడ్లకు రూ. 36 లక్షలతో మరమ్మతులు చేశారు.

గ్రామాల్లో పలు రోడ్ల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, రహదారులకు మరమ్మతులు నిర్వహించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కట్లు తప్పాయి



పాయకరావుపేట పట్టణంలో మెయిన్‌రోడ్డు నిర్మించడం ఎంతో సంతోషంగా ఉంది. గతంలో అస్తవ్యస్తంగా ఉన్న ఈ రోడ్డు వల్ల చాలా ఇక్కట్లకు గురయ్యాం. ఈ రోడ్డు నిర్మాణం వల్ల ప్రజలు, విద్యార్థుల, వాహనచోదకులకు ఇక్కట్లు తప్పాయి.

– కేశనకుర్తి సత్తిబాబు, పాయకరావుపేట

ఆనందంగా ఉంది



సత్యవరం నుంచి మాసాహేబుపేటకు రోడ్డు నిర్మించడం ఎంతో ఆనందంగా ఉంది. ఎంతో కాలంగా రోడ్డు నిర్మించడ పోవడం వల్ల చాలా ఇక్కట్లకు గురయ్యాం. ఇప్పటికి రహదారి కష్టాలు తీరాయి. చాలా గ్రామాల్లో కూడా రోడ్లు బాగుపడ్డాయి

– గెడ్డమూరి శ్రీనివాసరావు, మాసాహేబుపేట

అన్ని వర్గాల ప్రజలకు మేలు



గంటవానిపాలెంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. మండలంలోని గంటవానిపాలెంలో నిర్వహించిన శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రభుత్వ పథకాల లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత చంద్రబాబు పాలనకు జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడాగమనించి ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ విజయం కోసం పాటుపడాలన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మరాదని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, వైఎస్సార్‌సీపీ నేతలు అరిగా శ్రీనివాసరావు, రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామకూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఆవిష్కరించారు.

దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేయాలి

- ఓటరు నమోదుపై డీఆర్వో సమీక్ష



తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్వో దయానిధి



ఎస్.రాయవరంలో మాట్లాడుతున్న డీఆర్వో దయానిధి

నక్కపల్లి: ఓటు హక్కు కోసం 18 ఏళ్లు నిండిన వారి నుంచి వచ్చిన దరఖాస్తులు, తొలగింపులు, సవరణల కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే అదే రోజు ఆన్‌లైన్ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల నమోదు ప్రక్రియపై మండల స్థాయి అధికారులతో శనివారం ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని దరఖాస్తులను ఆధారాలతో సహా బీఎల్‌వోలు తమ వద్ద సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడం వల్ల పోలింగ్ స్టేషన్లలో ఒంటరి మహిళలు ఎంతమంది ఉన్నారో పెన్షన్ డేటా ఆధారంగా సేకరించాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిపోయిన వారి ఓట్లకు సంబంధించి ఫారం 7 సిద్ధం చేయాలని, అలాంటి ఓటర్ల ఎంతమంది ఉన్నారనే వివరాలు సేకరించాలని తెలిపారు. ఒక వ్యక్తికి ఒక చోట మాత్రమే ఓటుహక్కు ఉండాలన్నది ఎన్నికల సంఘం నిబంధన అని చెప్పారు. మరణించిన వారి ఓట్ల తొలగింపునకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి వద్ద మరణ రిజిస్టర్‌ను తీసుకుని ఆ వివరాలు కూడా బీఎల్‌వోలు ఉంచుకోవాలన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలు విషయంలో బీఎల్‌వోలు, మండల స్థాయి అధికారులు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గంపగుత్తుగా వచ్చే దరఖాస్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వి.అంబేడ్కర్, డిప్యూటీ తహసీల్దార్ నీరజ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఎన్నికల డీటీ తాతాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ పాప తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లు ఉన్న అందర్నీ ఓటర్లుగా నమోదు చేయాలి

ఎస్.రాయవరం: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కర్నీ ఓటరుగా నమోదు చేయాలని డీఆర్వో దయానిధి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు ప్రక్రియ ఎంత వరకు వచ్చింది తదితర విషయాలపై ఆరా తీశారు. అర్హత ఉండి ఓటు లేదన్న సమస్య రాకూడదన్నారు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీ నాయకుల దృష్టి ఓటరు వివరాలపై ఉండడం సహజమని వారి అభ్యంతరాలు వెంటనే సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పి.అప్పారావు,తహసీల్దార్ విజయ్‌కుమార్ ,ఈవీపీఆర్డీ సత్యనాయణ, ఎంఈవో మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాల విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రావూరి సుబ్బారావు

పాయకరావుపేట: యువజనోత్సవాల విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. రోటరీ యువజన ఉత్సవాలు రంగం కార్యక్రమం ముగింపు సందర్భంగా పట్టణంలోని సాయి ఉత్సవ్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు బహుమతులు అందజేశారు. తుని, పాయకరావుపేట మండలాల నుంచి 40 పాఠశాలలు, 10 కళాశాలల నుంచి 2000 మంది విద్యార్థులు ఈ యువజనోత్సవాల్లో పాల్గొన్నారు. 14 అంశాల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో పాల్గొని 280 మంది విద్యార్థులు విజయం సాధించినట్టు రోటరీ కార్యదర్శి కిషోర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు వర్మ, అసిస్టెంట్ గవర్నర్ బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 237 కేసుల పరిష్కారం

- జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన
- భారీగా తరలివచ్చిన కక్షిదారులు



యలమంచిలి కోర్టు వద్ద కక్షిదారులు



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న ఏజేఎఫ్‌సీఎం జడ్జి వీర రాఘవేంద్రరావు

యలమంచిలి: స్థానిక న్యాయస్థానంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌కు కక్షిదారుల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ కేసులను రాజీ చేసుకోడానికి యలమంచిలి కోర్టు పరిధిలోని వివిధ మండలాలకు చెందిన కక్షిదారులు భారీగా తరలి వచ్చారు. న్యాయస్థానం ఆవరణ కక్షిదారులతో నిండిపోయింది. చిన్న చిన్న కేసులు, భూతగాదాలు, వినియోగదారుల కేసులు, ఎక్సైజ్ కేసులు, క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలని పోలీసులు కక్షిదారులకు తెలియపరచారు. యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి (మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షురాలు) ఎ.సాయికుమారి, ఏజేఎఫ్‌సీఎం అదనపు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ టి.వీరరాఘవేంద్రరావు ఆధ్వర్యంలో శనివారం 237 కేసులు పరిష్కారమయ్యాయి.

రాజీ మార్గమే రాజ మార్గంగా ఈ సందర్భంగా వారు కక్షిదారులకు అవగాహన కల్పించి, కేసులు పరిష్కరించారు. జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారం కావడంతో పలువురు కక్షిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు డి.వెంకటరావు, పి.వి రమణ, న్యాయవాదులు, తహసీల్దారు రాణీ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

చలో నెల్లూరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కోటవురట్లలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న హిందూ, ముస్లిం పెద్దలు

కోటవురట్ల: నెల్లూరులో ఈ నెల 19న జరగనున్న జయహో 2వ జాతీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడాల రమణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మహాత్ముని విగ్రహం వద్ద చలో నెల్లూరు గోడపత్రికను శనివారం ఆవిష్కరించారు. ముందుగా మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, జయహో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు మాట్లాడుతూ జాతీయోద్యమ స్ఫూర్తితో జాతిని ఏకం చేసేందుకు ప్రతి ఒక్కరూ చేయికలపాలన్నారు. మతోన్మాదాన్ని నిర్మూలించి నవసమాజ స్థాపనకు జాతీయ స్థాయిలో జరుగుతున్న మహోద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జయహో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి వెంకటరావు, బీసీ నాయకుడు యల్లపు కుమారరాజా, ముస్లిం ప్రతినిధి షేక్ ఖాసిమ్, కో-ఆప్షన్ మెంబర్ ఖుదాబాషా, దళిత నాయకుడు నడింపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సవం



గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు



మునగపాకలో బాల గౌరమ్మను ఊరేగిస్తున్న దృశ్యం



ఏటికొప్పాకలో గౌరీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

రాంబిల్లి: దిమిలిలోని తామరచెర్ల వీధిలో శనివారం గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గౌరీపరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీధుల్లో గౌరీపరమేశ్వరులను ఊరేగించిన అనంతరం శారదా నదిలో నిమజ్జనం చేశారు. నేలవేషాలు, కోలాటాలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

బాలగౌరమ్మ ఊరేగింపు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో బాలగౌరమ్మ ఊరేగింపును శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బాల గౌరమ్మను ఆలయం నుంచి పల్లపు వీధి,సంతబయిల,మధ్యవీధి, పంచాయతీ వీధి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు,పెద్దలు పెంటకోట వెంకట్,పొలిమేర కృష్ణ,ఆడారి సూరిబాబు,కాండ్రేగుల జగ్గప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సారె ఊరేగింపు

యలమంచిలి: మండలంలోని పలు గ్రామాల్లో గౌరమ్మ సారెను శనివారం రాత్రి అత్యంత భక్తి శ్రద్ధతో ఊరేగించారు. నెల రోజుల పాటు గౌరీ పరమేశ్వరులకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి, ఆఖరి రోజు వివిధ రకాల పిండివంటలతో సారెను సమర్పించారు. ఏటికొప్పాక, పురుషోత్తపురం, కొత్తలి, పులపర్తి, పోతిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో గౌరీ పరమేశ్వరులకు పూజలు నిర్వహించి, సారె ఊరేగించారు. ఉత్సవం సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బాలబాలికలు శ్రీకృష్ణుడు, వివిధ దేవతామూర్తుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

28న కట్టుబోలులో శూలాల మహోత్సవం

రాంబిల్లి: కట్టుబోలులో ఈ నెల 28న నవదుర్గ అమ్మవారి శూలాల మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు గురు భవానీలు నక్కా నాగేశ్వరరావు, కళిరెడ్డి బాబూరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అగ్నిగుండ ప్రవేశాలు జరుగుతాయని నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి ఏటా నవ దుర్గ అమ్మవారి శూలాల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది శూలాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న శివరామకృష్ణ

పాయకరావుపేట: మండలంలోని మంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గర్భిణులకు పౌష్టికాహారం సరఫరా చేసినట్టు శ్రీ సరస్వతి విద్యా సేవా సమితి అధ్యక్షుడు గొర్రెల శివరామకృష్ణ తెలిపారు. ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. మంగవరం పీహెచ్‌సీలో శనివారం 100 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు స్వరాజ్యం, సూపరిటెండెంట్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్‌లు దాడి జగన్, కర్రి సూరినాయుడు

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో ఎం. అలమండ – మామిడిపల్లి గ్రామాల మధ్య రోడ్డు సమస్యకు మోక్షం కలిగింది. కనీసం నడవడానికి వీలులేని 4.5 కిలోమీటర్ల మేర మట్టిరోడ్డును బీటీరోడ్డుగా నిర్మించేందుకు రూ 2.80 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్మాణ పనులకు ఎం. అలమండ వద్ద సర్పంచ్‌లు దాడి జగన్, కర్రి సూరినాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు పోతల లక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దశాబ్దాల కల నెరవేర్చిన డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీటీసీ పోతల వెంకటరావు, వీఆర్వో పోతల శంకర రావు, పాల సంఘం అధ్యక్షుడు పాలిపిరెడ్డి రమణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బండారు ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా లక్ష్యం

రావికమతం: తప్పులు లేని ఓటరు జాబితా మనందరి లక్ష్యమని, ఇంటింటికి తిరిగి విచారణ చేసి అనర్హత ఓట్లు తొలగించాలని నియోజక వర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి ప్రమీలాగాంధీ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి రవికిరణ్‌తోపాటు అధికారులు, ఫీల్డ్ సిబ్బందితో శనివారం ఆమె సమీక్షించారు. మండలంలో కొత్తగా ఓటు నమోదుకు, తొలగింపు, మైగ్రేటెడ్‌కు సంబంధించి 3,400కు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు.

బాలసదనానికి రగ్గులు వితరణ

నర్సీపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు బాలసదనం సూపరిండెంటెంట్ సిహెచ్. వరలక్ష్మికి నర్సీపట్నంలో రగ్గులు అందజేశారు. స్త్రీ శిశు, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చింతపల్లిలో నిర్వహిస్తున్న బాలసదనంలో 50 మంది బాలికలకు వీటిని వితరణ చేశారు. జూనియర్ కళాశాలకు చెందిన 1977–79 ఇంటర్మీడియట్ బ్యాచ్ విద్యార్థులు సంఘంగా ఏర్పడి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని సన్యాసిపాత్రుడు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జీకేఆర్ కుమార్‌బాబు, సినీ నిర్మాత కర్రి రాంగోపాల్, పిట్టా శ్రీనివాస్, గణేష్, సభ్యులు పాల్గొన్నారు.

సీఐలకు స్థానచలనం

దొండపర్తి: విశాఖ రేంజ్ పరిధిలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు డీఐజీ హరికృష్ణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం సీసీఎస్ సీఐ ఎం.బుచ్చిరాజును అచ్యుతాపురం సీఐగా, అక్కడి ప్రస్తుత సీఐ వై.మురళీరావును విశాఖ రేంజ్‌లో వీఆర్‌కు బదిలీ చేశారు.

సనాతన ధర్మంపై ఆస్ట్రేలియా వనిత ప్రచారం



పాదయాత్ర చేస్తున్న ఆస్ట్రేలియా వనిత జార్జ్‌మోర్

నక్కపల్లి: భారతదేశంలో ఉన్న సనాతన ధర్మం తనను ఎంతో ఆకర్షించిందని, ఈ సనాతన ధర్మంపై ప్రచారం చేసేందుకు పూరీనుంచి చార్‌ధామ్‌కు పాదయాత్ర చేస్తున్నట్టు ఆస్ట్రేలియాకు చెందిన మహిళ జార్జ్‌మోర్ తెలిపారు. ఈమె చేస్తున్న పాదయాత్ర శనివారం నక్కపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానికులు ఆమెను అభినందించారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాల మీద ఆసక్తితో జగద్గురువు ఆదిశంకరాచార్యుల అద్వైత సిద్ధాంతం, లక్ష్యాలను ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నట్టు ఆమె తెలిపారు.